దుండగులపై చర్యలు తీసుకోవాలి



ప్రజలకు సేవలందించే వైద్యులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడడం హేయమైన చర్య. దాడులు జరిగినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించి దుండగులపై చర్యలు తీసుకోవాలి. ఈ నెల 9న కోల్‌కోత్తాలో మహిళా వైద్యురాలిపై సామూహిక అత్యాచారం, పైశాచికంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ ఆర్. రవిశంకర్‌రెడ్డి, పీలేరు

కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి



సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కోల్‌కత్తాలో వైద్యురాలిపై హత్యాచారం సభ్య సమాజానికి మాయనిమచ్చ. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లోనూ వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

– నాగశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్, మదనపల్లె



సెక్యూరిటీని నియమించాలి



రోగులకు వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బందికి రక్షణ లేకుండా పోతోంది. ఇటీవల కాలంలో వైద్యులపై దాడులు జరుగుతున్నందున వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. లేకుంటే రాత్రి సమయంలో విధులు నిర్వహించడం కష్టంగా ఉంటుంది. దీనిపై ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– కృష్ణకుమారి, హెడ్‌నర్సు, మదనపల్లె

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం



డాక్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టం అవసరం. కోల్‌కతా తరహా ఘటనలను నివారించాలంటే భద్రతతో పాటు పిల్లల పెంపకంలోనూ మార్పురావాలి. ఆడపిల్లలు బయటకు వెళ్ళి ఇంటికి ఆలస్యంగా వస్తే తల్లిదండ్రులు ప్రశ్నిస్తారు. మగపిల్లలు అర్ధ రాత్రికి వచ్చినా పట్టించుకోరు. మంచి పెంపకంలో పెరిగిన పిల్లలకు ఎలాంటి దురాలోచనలు రావు. జూనియర్ డాక్టర్‌పై హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ ఎండీ యస్దానీ, పీహెచ్‌సీ, పెద్దతిప్పసముద్రం

క్లుప్తంగా

బీజేపీ సభ్యత్వ నమోదు

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. మండలాధ్యక్షుడు కార్యం శంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గిరిజన కో కన్వీనర్ రవి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

కోడిపందెం స్థావరాలపై పోలీసుల దాడి

గుర్రంకొండ : మండలంలోని టి.పసలవాండ్లపల్లె పంచాయతీ నగిరిలో బుధవారం కోడిపందెం స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. గ్రామానికి సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా స్పెషల్ పోలీస్ టీమ్, చిన్నమండ్యం, గుర్రంకొండ పోలీసుల ఆధ్వర్యంలో మూకుమ్మడి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 మంది జూదరులు, ఆరు పందెం కోళ్లు, 23 ద్విచక్రవాహనాలు, రూ.20,700 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

పెరిక బలిజకు బీసీ-బీ ధ్రువపత్రం ఇవ్వాలి

పీలేరు : మండలంలో గత 40 సంవత్సరాలుగా వివిధ పనులు చేసుకుంటూ స్థిర నివాసులగా ఉంటూ జీవనం సాగిస్తున్న పెరిక బలిజలకు బీసీ–బీ ధృవపత్రం అందజేయాలని తహసీల్దార్ బీమేశ్వర్‌రావుకు జనసేన పార్టీ నాయకులు కామిశెట్టి సుధాకర్, రమణ వినతిపత్రం అందజేశారు. బుధవారం వారు తహసీల్దార్‌ను కలసి పెరిక బలిజల సమస్యలు తెలియజేశారు. గతంలో శాశ్వత కులధృవీకరణ పత్రాలు ఇచ్చేవారని, అయితే కంప్యూటర్ జనరేట్ చేసిన తరువాత కులధృవీకరణ పత్రం ఇవ్వడం లేదన్నారు. ఇకనైనా తమ సమస్య పరిష్కరించాలని కోరారు.

పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ

పీలేరు రూరల్ : ప్రభుత్వ చౌక దకాణాల ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరుకులు పారదర్శకంగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చౌకదుకాణంలో ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు బియ్యం, చక్కెర, కందిపప్పు, రాగిపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించాలి

కేవీపల్లె : ఎస్సీ, ఎస్టీల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ, సీపీఐ నియోజవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ కోరారు. బుధవారం తహసీల్దార్ క్రాంతికుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోఎస్సీ, ఎస్టీలు, పేద వర్గాలకు సంబంధించిన భూ సమస్యలు తక్షణం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

104 వైద్య సేవలు

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం గ్రామంలో బుధవారం 104 వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, తమ సూచనలు, సలహాలను డాక్టర్ లీలా అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం హాజరైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కలికిరి : కలికిరి రెడ్డివారిపల్లిలోని సర్వోదయ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు కలికిరి సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు అందజేశారు. వృద్ధుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని శీతాకాలంలో ఇబ్బందులు పడకుండా ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత ఎస్‌బీఐ అధికారి వెంకటరెడ్డి కొనియాడారు. ట్రస్టు సేవా కార్యక్రమాలకు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లును తిరస్కరించాలి

వాల్మీకిపురం : వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ 2024 బిల్లును వెంటనే తిరస్కరించాలని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యూత్ స్టేట్ సెక్రటరీ షబ్బీర్ ఉల్లాఖాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని 14,15, 25 అధికరణలను ఉల్లంఘిస్తున్నందున బిల్లును వెంటనే నిలిపి వేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు.

ఉచిత శిక్షణ.. భవితకు రక్షణ

టెట్ కోచింగ్‌కు అనూహ్య స్పందన



టెట్ ఉచిత శిక్షణకు హాజరైన విద్యార్థులు

మదనపల్లె సిటీ : టీటీసీ, బీఈడీ కోర్సులు చేసిన విద్యార్థులకు టెట్ ఉచిత శిక్షణ వరంగా మారింది. మైనార్టీ అభ్యర్థుల కోసం మదనపల్లె మున్సిల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో టెట్‌కు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. జిల్లాలోని దాదాపు 150 మందికిపైగా విద్యార్థులకు శిక్షణ పొందుతున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు శిక్షణ ఇస్తున్నారు. అనుభవం కలిగిన అధ్యాపకులచే కోచింగ్ ఇస్తున్నారు. త్వరలో జరగనున్న పరీక్షకు విద్యార్థులకు అన్ని విధాలుగా సన్నద్ధం చేస్తున్నారు. డైలీ టెస్టులు, వీక్లీ టెస్టులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూపొందించిన స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా అందజేశారు. మైనార్టీలకు అన్ని సౌకార్యలు కల్పించాలన్న ఆశయంతో ఈ ఉచిత శిక్షణ ఏర్పాటు చేశారు.

సందేహాలు నివృత్తి చేస్తున్నారు



టెట్ కోచింగ్‌లో సులభంగా అర్థమయ్యే విధంగా చెబుతున్నారు. ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేస్తున్నారు. డైలీ, వీక్లీ టెస్టులు పెట్టడం వల్ల మాలో ధైర్యం నింపుతోంది. మాలాంటి వారికి ఉచిత కోచింగ్ వరంగా మారింది.

– హాజిక, మదనపల్లె

స్టడీ మెటీరియల్ ఉపయోగం



టెట్ పరీక్షకు స్టడీ మెటీరియల్ అందజేశారు. దీని వల్ల మాకు ఎంతో ఉపయోగం. అనుభవం కలిగిన అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తీసుకోవడం వల్ల మాకు ధైర్యంగా ఉంది. ఉచిత కోచింగ్ మైనార్టీలకు వరంగా మారింది.

– ఆస్మా, మదనపల్లె

కల్యాణం..కమనీయం



శ్రీవల్లి, దేవసేన, సుబ్రమణ్యం స్వామి వారి కల్యాణోత్సవ దృశ్యం

కురబలకోట : శ్రీవల్లి, దేవసేన, సుబ్రమణ్యం స్వామి కల్యాణోత్సవం బుధవారం అంగళ్ల మల్లయ్యకొండపై వేడుకగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగళ్లుకు చెందిన సిద్దల వెంకట్రమణారెడ్డి, రోహిణి దేవి (చిట్టెమ్మ) దంపతులు కార్య నిర్వాహకులుగా ఈ వేడుకలు వేద మంత్రాల నడుమ సాగాయి. అభిషేకం, కర్పూర హారతి, హోమం నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి కల్యాణం చూసిన వారి అభీష్టాలు నెరవేరుతాయని వేదపండితులు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి, సిద్దల రాజు, సుజాత, వాసు దంపతులు, మాజీ సర్పంచ్ పోరెడ్డి పద్మావతమ్మ, మొలక గోపాల్ రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సిద్దల సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకా



మర్రిపాడు జెడ్పీహైస్కూల్లో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

గుర్రంకొండ : క్షయవ్యాధి (టీబీ) నివారణకు బీసీజీ టీకాలు వేసుకోవాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, వాల్మీకిపురం టీబీ యూనిట్ పర్యవేక్షులు నాగిరెడ్డి సూచించారు. మండలంలోని మర్రిపాడులో బుధవారం బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్థానిక తెలుగు జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం బీసీజీ టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. వయోజనా బీసీజీ టీకాలు మరణాల తీవ్రతను నివారించడంలో ఉపయోగపడతాయన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషిలో రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. బీసీజీ టీకాలు ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా వేసుకోవచ్చన్నారు. ప్రతి సోమ, గురువారాల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో బీసీజీ టీకాలు ఉచితంగా వేస్తారన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ అరుణ, ఏఎన్ఎం ధనమ్మ, ఆశావర్కర్లు షర్మిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏపీఎంఎస్ఐడీసీ ఎస్ఈ ఆనందరెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ సర్వజనబోధనాసుపత్రి పైఅంతస్తులో నిర్మించిన కొత్త భవనాలను ఆయన పరిశీలించారు. అక్కడక్కడా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. అనంతరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్. జమున, అధికారులతో సమావేశమయ్యారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఇచ్చిన గడువులోపు పూర్తిచేయాల్సిన నిర్మాణ పనులను, ఎన్ఎంసీ అనుమతికి అవసరమైన నిర్మాణాలను అడిగి తెలుసుకున్నారు. 80 అదనపు పడకల గదుల కోసం నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, డీఐఈసీ భవనంపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ఐసీయూ విభాగానికి అదనంగా 60 పడకలు అవసరమన్న ప్రిన్సిపాల్ ప్రతిపాదనలపై నివేదికలు తీసుకుంటామన్నారు. తర్వాత ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాలు, బోధనాతరగతుల భవనాలు, ల్యాబ్‌లు, విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె : మండలంలో విజృంభిస్తున్న జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. బుధవారం ఆయన గుండ్లపల్లి పంచాయతీ దిగువపల్లెలో పర్యటించారు. డెంగీ బారిన పడిన వారి పరిస్థితిపై డాక్టర్ ఆశాలతను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం బారిన పడిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి, వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట సర్పంచు మౌలాలి, కార్యదర్శి రమణ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో స్థానికులకే ప్రాధాన్యత

- పోర్టబుల్ కార్డుదారులు ఆధార్ బదిలీ చేసుకోవాలి
- అలాట్‌మెంట్ సరిపోక రెగ్యులర్ కార్డుదారులకు ఇబ్బందులు
- తహసీల్దార్ ఖాజాబీ



రేషన్‌డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె : మండలంలో రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి మొదట స్థానికులకే ప్రాధాన్యత ఇచ్చి సరుకులు పంపిణీ చేయాలి. మిగిలిన తర్వాతే పోర్టబుల్ కార్డుదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ ఖాజాబీ పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్‌షాపు డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ...మండలంలో పోర్టబులిటీ కారణంగా స్టాక్ సరిపోక, రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. పోర్టబులిటీ సౌకర్యం అనేది కేవలం ఒకటి లేక రెండునెలలు తాత్కాలిక పద్ధతిలో మదనపల్లె మండలంకు వలస వచ్చిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఆధార్, రేషన్‌కార్డు ఇతర నియోజకవర్గాల్లో నమోదు చేసుకుని, ఐదారేళ్లుగా పట్టణంలో స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నటువంటి వారు పోర్టబులిటీని ఉపయోగించుకోవడంతో అసలైన కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. 10 శాతం అదనంగా అలాట్‌మెంట్ కేటాయించినా రేషన్ పంపిణీ సక్రమంగా జరగడం లేదన్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన పోర్టబులిటీ కార్డుదారులు, మదనపల్లె మండలం, మున్సిపల్ పరిధిలో రేషన్ సరుకులు పొందాలనుకుంటే తక్షణమే తమ ఆధార్, రేషన్‌కార్డును స్థానిక చిరునామాకు మార్పించుకోవాలన్నారు. అప్పుడు ప్రభుత్వం నుంచి వారికి అలాట్‌మెంట్ జరుగుతుందని, రేషన్ పంపిణీలో ఇబ్బందులు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, సివిల్ సప్లయిస్ గోడౌన్ డీటీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పీలేరు రూరల్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎంజేఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి అన్నారు. బుధవారం అవినాష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పీలేరు ఏరియా ఆస్పత్రి, చిత్తూరు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేజ, ల్యాబ్ టెక్నీషియన్ మునాఫ్ పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ములకలచెరువు : మండలంలోని బురకాయలకోటకు చెందిన వైఎస్సార్‌సీపీ ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా అన్న అమీర్‌బాషా కుమారుడు సయ్యద్‌వలీ వలిమా కార్యక్రమంలో బుధవారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండల నాయకులతో మాట్లాడారు.

శ్రమించారు.. మూగజీవిని కాపాడారు

మదనపల్లె సిటీ : ఓ పాడి ఆవు పొరపాటున ఓ పెద్ద గుంతలో పడిపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి గుంత బురదమయంగా మారిపోయింది. దీంతో పాడిఆవు గుంతలో పడి నరకయాతన అనుభవించింది. గమనించిన మదనపల్లె మండలం పెంచుపాడు పంచాయతీ కట్టుబావికి చెందిన స్థానిక యువకులు వినోద్, అమర, రమణ పాడి ఆవును కాపాడేందుకు ముందుకు వచ్చారు. సమీపంలోని జేసీబీని పిలిపించి గుంత చుట్టూ మట్టిని తోడి వేయించారు. పాడిఆవుకు పెద్ద బెల్టు కట్టి జేసీబీ సహాయంతో గుంతలో నుంచి బయటకు లాగేశారు. దీంతో పాడి ఆవు ఊపిరి పీల్చుకుంది.

వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

మాజీ ఎమ్మెల్యే చింతల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పూర్వ వైభవం తీసుకొస్తామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పీలేరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సమాజంలో గెలుపు, ఓటములు సహజమేనన్నారు. 40 ఏళ్లుగా ప్రజా క్షేత్రంలోనే తన జీవితాన్ని గడిపానని, రాబోవు రోజుల్లో సైతం ప్రజలు, పార్టీ శ్రేణులతోనే మమేకమై ఉంటానన్నారు. ఎవ్వరికీ ఏ కష్టం వచ్చినా, ఎటువంటి అవసరం ఉన్నా తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు పని చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే నాయకుడిని, కార్యకర్తకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దాడులు, ధ్వంసం వంటివి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లారి తిమ్మా రెడ్డి, హబీబ్‌బాషా, వెంకట్రమణా రెడ్డి, కమలాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, నీక్లభాస్కర్, జగన్మోహన్ రెడ్డి, శ్రీధర్ రాయల్, ముక్తియార్, నరసింహులు, నల్లంకి నరసింహులు, చింతల శివానంద రెడ్డి, వెంకట రెడ్డి, ఆనంద రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, ఆనంద, లక్ష్మినారాయణ రెడ్డి, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే గోశాలకు తరలింపు

– మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల.


మదనపల్లె : మున్సిపల్ పరిధిలో రోడ్లమీద ఇష్టారాజ్యంగా సంచరిస్తూ, వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశాల మేరకు... సెప్టెంబర్ 10వతేదీలోపు పట్టణంలోని నివాసప్రాంతాల ప్రధానరోడ్లు, ప్రధాన కూడళ్లలో పశువులు సంచరించకుండా వాటి యజమానులు ఇంటి ఆవరణలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. 10వ తేదీ పైన రోడ్లపై పశువులు సంచరిస్తే... పురపాలక సిబ్బంది ద్వారా గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. అలాగే పట్టణంలో పందుల సంచారంపై నిషేధం విధించామని, సెప్టెంబర్ 20వ తేదీలోపు వాటిని మున్సిపల్ లిమిట్స్‌కు 5 కి.మీ.ల అవతల పెంచుకోవాలన్నారు. లేనిపక్షంలో మున్సిపల్ సిబ్బంది ద్వారా వాటిని పట్టించి, దట్టమైన అటవీ ప్రాంతంలో వదిలేస్తామన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో వీహెచ్‌పీఎస్ వెలుగులు

మదనపల్లె : దివ్యాంగుల జీవితాల్లో వికలాంగుల హక్కుల పోరాటసమితి (వీహెచ్‌పీఎస్) వెలుగులు నింపిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు షేక్‌మౌలాలి తెలిపారు. బుధవారం వీహెచ్‌పీఎస్ 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మిషన్ కాంపౌండ్‌లోని శాంతిసదన్‌లో కేక్ కట్‌చేసి దివ్యాంగులకు, వృద్ధులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా షేక్ మౌలాలి మాట్లాడుతూ... వీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించామన్నారు. దివ్యాంగులకు ఆరోగ్యశ్రీ, బ్యాటరీ స్కూటర్లు, సైకిళ్లు, లోన్స్, ఇతర పథకాలు అందుతున్నాయంటే కేవలం వీహెచ్‌పీఎస్‌తోనే సాధ్యమయ్యాయన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ సీనియర్ నాయకురాలు ఈశ్వరి, నరసింహులు, నాగరాజ, మునిరాజ, భీమయ్య, థామస్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

త్వరలో 14 కొత్త ఆర్టీసీ బస్సులు

జిల్లా ప్రజారవాణాధికారి రాము



సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీటీఓ రాము

మదనపల్లె సిటీ : మదనపల్లె ఆర్టీసీ-1 డిపోకు త్వరలో 14 ఆర్టీసీ అద్దె బస్సులు మంజూరైనట్లు జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. బుధవారం స్థానిక వన్,టు డిపోలను తనిఖీ చేశారు. డిపో ఆవరణంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కొత్త బస్సు సర్వీసులను బెంగుళూరు, కడప, వేలూరు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె సర్వీసులను బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.అందరూ కలిసి కష్టపడి పని చేసి డిపో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. జులై నెలలో రీజియన్‌లో ఓఆర్‌లో మొదటి స్థానం నిలిపినందుకు, గ్యారేజ్‌లోని షెడ్డు పైకప్పు రిపేరి చేసి సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణా రెడ్డి, సీఐలు రేవతి, గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలపై ఆర్డీవో విచారణ

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల జారీ అంశంపై రాయచోటి ఆర్డీవో రంగస్వామి బుధవారం విచారణ నిర్వహించారు. గతంలో పట్టణంలోని లక్ష్మీపురం, సరోజిని వీధి, గాజులవెంకటప్ప వీధి, జేకే నగర్ ప్రాంతాల్లోని పలు చిరునామాలతో చాలా మంది ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోలు క్షేత్రస్థాయి పరిశీలనలో పలు తప్పులు ఉన్నట్లు నిర్ధారణ చేసుకుని పీలేరు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు ద్వారా ఆర్డీవోకు తెలియజేశారు. దీంతో ఆర్డీవో బుధవారం పీలేరుకు చేరుకుని దరఖాస్తులలోని చిరునామాల ఆధారంగా విచారణ జరిపారు. నివేదిక ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, వీఆర్వోలు శిల్ప, కవిత, మాల మహానాడు నాయకులు సుభాష్, మల్లికార్జున పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

వాల్మీకిపురం : సమాజంలో హెచ్ఐవీ వ్యాధి నివారణపై యువత అవగాహన ఉండాలని ఎస్ఐ శ్రీహరి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాప్తి, వ్యాధి నివారణ అన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఆర్ఆర్ఎస్ సంస్థ సభ్యురాలు శ్వేత, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై నివారణపై ప్రజలకు అవగాహన అవసరమని ఐసిటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూలులో బుధవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య,ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కృషి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షబానా, ఎల్‌టి బాలాజీ, అవుట్‌రీచ్ వర్కర్లు రేఖ, సావిత్రి, సునిత తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై డాక్టర్ ప్రత్యూష విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీకి గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు , సూచనలను తెలియజేశారు.

ప్యాడ్ బ్యాంకు ఆవిష్కరణ

మదనపల్లె సిటీ : స్థానిక బీటీ ప్రభుత్వ బీటీ డిగ్రీ కాలేజీలో బుధవారం హెలింగ్‌మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్యాడ్‌బ్యాంకును ఆవిష్కరించారు. మహిళలు నెలసరి సమయంలో ప్యాడ్‌ల కోసం ఇబ్బందులు పడుతుంటారని, వీటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీటీ కాలేజీ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాళ్లు బాబు, కృష్ణవేణి, టు టౌన్ రైటర్ రామ్మూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.